# మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

3-4-2025 గురువారం పేజీలు 4 www.manabalagam.com


# నియోజకవర్గానికి లక్షమంది



### రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు

### మెదక్, నిజామాబాద్ నేతలకు కేసీఆర్ సూచన

**గజ్వేల్,ఏప్రిల్2:** భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు.ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు- చూసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన నేతలు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, గణేశ్ గుప్తా, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.





# రాహుల్ ఆదేశాల మేరకు బీసీ కులగణన

### మా రాష్ట్రంలో ఆమోదించిన బీసీ బిల్లును ఆమోదించండి

### మా డిమాండ్‌కు మీరు మోకాలడ్డవద్దు

### జంతరమంతర్ బీసీ ధర్నాలో సీఎం రేవంత్

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2:** బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కుటగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరా గాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొలి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విహెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

# వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

### లేకుంటే పార్లమెంటు స్థలం కూడా వక్ఫ్‌దే అంటారు

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, ఏప్రిల్2:** వక్ఫ్ చట్ట సరవణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. దీనిపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపీలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడిరచారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది. ఇక ఈ వక్ఫ్ బోర్డు విషయంతో తాము క్లియర్‌గా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయిం చామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోర్డులల్లో ముస్లిం మహిళలకు చోటు- ఉండడం లేదని తెలిపారు. దీంతో ఈ బోర్డుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయని.. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు- ఉన్నాయి. అందుకోసమే ఈ బిల్లును తీసుకు వస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సభ్యులు గౌరవ్ గోగోయ్ మాట్లాడుతూ.. ఈ బిల్లుపై త ప్పు దొవ పట్టించే ప్రయత్నాన్ని కేంద్ర మంత్రి కిర ణ్ రిజిజు చేస్తున్నారంటూ మండిపడ్డారు.



## సర్దార్ సర్వాయి పాపన్నకు కలెక్టర్ ఘన నివాళి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఘనంగా నివాళులు అర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, ఎల్ డీ ఎం మల్లికార్జున్ రావు బీసీ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలి

**హౌసింగ్ ఎండీ గౌతమ్**
**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై వీసీ ద్వారా సమీక్ష**
**హాజరైన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన నిర్మించాలని హౌసింగ్ ఎండి గౌతమ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆయా మండలాలు, మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో హౌసింగ్ ఎండీ గౌతమ్ బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సమీకృత కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎండీ గౌతం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇండ్లు నిర్మించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసిందని తెలిపారు. అర్హులైన వారందరూ పథకాన్ని నిర్ణీత




గడువులోగా సద్వినియోగం చేసుకొని ఇండ్లు నిర్మించుకునేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో ఇంతవరకు ఎన్ని దరఖాస్తులను అప్రూవ్ చేశారు ? ఎన్ని ఇండ్లు గ్రౌండ్ చేశారు? ఎన్ని ఇండ్లు ఎన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి అని ఆరా తీశారు. బేస్ మెంట్ వరకు నిర్మాణంలో ముందంజలో ఉన్న ఖమ్మం, సూర్యాపేట ఇతర జిల్లాల అదనపు కలెక్టర్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. వేగంగా బేస్మెంట్ వరకు ఇండ్ల నిర్మాణాలు ఎలా పూర్తి చేశారు? దానికి అమలు చేసిన ప్రణాళిక ఏంటో అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ వరకు పూర్తయిన ఇండ్లకు త్వరలోనే మొదటి దశ డబ్బులు చెల్లిస్తామని వెల్లడించారు. పూర్తిగా ఇండ్ల నిర్మాణానికి డబ్బులు లేని మహిళా సంఘాల బాధ్యులకు సంబంధిత మహిళా సంఘాల నుంచి రుణాలు ఇప్పించాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో ఏ ఇబ్బందులు ఎదురవుతున్నాయో ఆరా తీశారు. త్వరలోనే నియోజకవర్గానికి 3500 ఇండ్ల నిర్మాణాలను చేపట్టనున్నామని వెల్లడించారు. అర్హులైన వారందరూ ప్రభుత్వం నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఇండ్లను నిర్మించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ఫోటోలను ఎప్పటికప్పుడు అప్లికేషన్లు అప్డేట్ చేయాలని హౌసింగ్ ఎండీ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 12 మండలాల్లోని 12 గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8 వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లా వ్యాప్తంగా ఒక వెయ్యి 23 ఇండ్లు నిర్మాణానికి ఆమోదించగా, నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని అదనపు కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శంకర్, డిఈ ఖాజా ముజఫరుద్దీన్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (మన బలగం): సమాజంలో పలువురికి ఉపయోగపడే స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేట్ అట్లంట తెలంగాణ సొసైటీ (జీఏటీఎస్) అట్లాంటా అమెరికా సౌజన్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర మెట్‌పల్లి పాఠశాలలో ఆర్వో శుద్ధ జల ప్లాంట్ ఏర్పాటు చేశారు. 500 లీటర్ల కెపాసిటీ గల ఓవర్ హెడ్ ట్యాంకు, గంటకు 100 లీటర్ల తాగునీటిని అందించే ప్లాంటు సుమారు రూ.50 వేల విలువ కలిగినది పాఠశాలకు అందజేశారు. గ్రేట్ అట్లాంట తెలంగాణ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ చంద్రశేఖర్ అల్లాటి, ప్రెసిడెంట్ నవీన్ బత్తిని, చైర్మన్ నవీన్ ఉజ్జిని అండ్ జీఏటీఎస్ టీం సహకారంతో స్థానిక వెల్లుల్ల గ్రామ వాస్తవ్యులు బత్తిని శంకర్ గౌడ్ సారథ్యంలో రాచకొండ యాదగిరి, మిట్టపెల్లి సాయికుమార్ సమక్షంలో, ఎం.చంద్రశేఖర్ మండల విద్యాధికారి మెట్‌పల్లి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు కె.నారాయణ ఇవ్వడం జరిగింది. 300కు పైగా విద్యార్థులు అభ్యసిస్తున్న తమ పాఠశాలకు ఆరోఓ వాటర్ ప్లాంట్ అందించడం పట్ల ప్రధానోపాధ్యాయులు కె.నారాయణ జిఏటిఎస్ టీమ్ అట్లాంటా అమెరికా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె.నారాయణ ప్రధానోపాధ్యాయులు, ఎం.చంద్రశేఖర్, మండల విద్యాధికారి మెట్‌పల్లి, బత్తిని శంకర్ గౌడ్ వెల్లుల్ల, రాచకొండ యాదగిరి, మిట్టపల్లి సాయికుమార్, ఉపాధ్యాయులు మద్దిరాల గణేశ్, బత్తుల శివప్రసాద్, నారంబట్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కోచింగ్ పేరిట దోపిడీ

**ఆకాష్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి**
**ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్**



కరీంనగర్, ఏప్రిల్ 2 (మన బలగం): కరీంనగర్ నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల వెళ్లే దారిలో ఉన్న ఆకాష్ విద్యా సంస్థ కోచింగ్ పేరిట వేలాది రూపాయలు దోస్తుందని, దీనిని అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ విమర్శించారు. జెఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ కోచింగ్ పేరిట విద్యార్థుల నుంచి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని, దేశంలో ఎక్కడో వచ్చిన వారి విద్యా సంస్థలో ర్యాంకులు ఇక్కడ చూపిస్తూ ఇక్కడి విద్యార్థులను ఆకర్షించేందుకు పలు రకాలుగా యాడ్లు ఇస్తూ ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. తమ విద్యాసంస్థలో చదివితే మీకు ర్యాంకు తప్పకుండా వస్తుంది అని మాయ మాటలు చెబుతూ కోచింగ్ల పేరా, పుస్తకాలు పేరా, టీ షర్ట్స్ పేరా కోట్లాది విద్యా వ్యాపారాన్ని కొనసాగించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విద్యాసంస్థల చేరితే ర్యాంకు తక్కువ వచ్చినా మళ్లీ కోచింగ్ తీసుకుని తప్పకుండా ర్యాంకు వస్తుందని సంవత్సరాల తరబడి కోచింగ్‌లు ఇస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులు ఇలాంటి విద్యాసంస్థల మాయమాటల ఉచ్చులో పడకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని తప్పుడు ప్రచారం చేస్తూ కోట్ల రూపాయలు విద్యార్థుల నుంచి దోచుకుంటున్న ఆకాష్ విద్యా సంస్థపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆకాష్ విద్యాసంస్థల ఆగడాలపై ఉద్యమాలు చేస్తామని బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.



## పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు మద్దిమల్ల గ్రామాల్లో బుధవారం సన్నబియ్యం పంపిణీ పథకాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ లాకావత్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లెంకల లక్ష్మణ్, మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్ గౌడ్ డీలర్లతో కలసి తహసీల్దార్ ముక్తార్ పాషా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం రేషన్ షాప్ వద్ద రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం అందించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. పేద ప్రజలు గుండె చప్పుడు మన ప్రజా ప్రభుత్వం అన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిచడమే మన ప్రభుత్వం ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## నేడే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ల రాక

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): ఈ నెల 3వ తేదీన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, ఐదుగురు సభ్యులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలా దేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్ గురువారం జిల్లాలోని వేములవాడకు సాయంత్రం 06.00 గంటలకు చేరుకుంటారు. 4వ తేదీన శుక్రవారం ఉదయం 06.00 గంటలకు శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. ఉదయం 11.00 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

## రెడ్డబోయిన గోపికి ముదిరాజ్ సంఘం సన్మానం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా ముదిరాజ్ బిడ్డ రెడ్డబోయిన గోపి ఎన్నికైనందున వీర్నపల్లి మండల కేంద్రంలో బుధవారం రోజున ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తౌటు అజయ్, బోయిని రవి, తౌటు పెద్దులు, పెడతనపల్లి శేఖర్, పిట్ల ముత్యం, తౌటు అంజయ్య బోయిని లింబయ్య గుమ్మడి రాజేశం పిట్ల నాగరాజు, మండపల్లి రవి, తోటు శ్రీకాంత్, రాజం చాట్ల దేవరాజ్ శేఖర్ చొప్పరి రాజం, కాజి బాబు, లింగం, రాకేష్, బాలయ్య, చంద్రయ్య వీర్నపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు లకుపతి నాయక్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నల తిరుపతి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు వంతడుపుల సుధాకర్, శేఖర్, లింబాద్రి, ప్రకాష్ నాయక్, పిరియా నాయక్, అజ్మీర తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## కరెంట్ షాక్‌తో బర్రె మృతి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం భూక్యతండ గ్రామపంచాయతీలోని రాసిగుట్ట తండాలోని బాదావత్ గంగారం అనే రైతు యొక్క 80 వేలు విలువ కలిగిన బర్రె కరెంట్ షాక్ తలిగి మృతి చెందింది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

MANA BALAGAM
మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

# ప్రతి విద్యార్థిని కరాటే నేర్చుకోవాలి



మల్యాల, ఏప్రిల్ 2 (మన బలగం): ప్రతి విద్యార్థిని కరాటేలో శిక్షణ తీసుకోవాలని మౌంట్ కార్మెల్ పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతిష్ మరియా సూచించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు కరాటేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతిష్ మరియా మాట్లాడుతూ.. తమపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు ఆడపిల్లలు కరాటే తప్పకుండా నేర్చుకోవాలని సూచించారు. సమాజంలో ఆడపిల్లలకు జరిగే అన్యాయాలను ఎదుర్కోవాలంటే అన్ని రంగాలలో రాణించాలని చెప్పారు. కరాటే నేర్చుకున్న స్టూడెంట్స్‌కు సర్టిఫికెట్, బెల్ట్ అందజేశారు. కార్యక్రమంలో చీఫ్‌గెస్ట్‌గా మర్రిపల్లి లింగయ్య బ్లాక్ బెల్ట్ 6వ డాన్, సీనియర్ బ్లాక్ బెల్ట్ 2వ డాన్, కరాటే మాస్టర్, పేరెంట్స్, గార్డియన్స్, సపోటార్స్, మోటివేటర్స్, స్టూడెంట్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏదో లక్కీ డ్రా తీస్తే మీ గవర్నమెంట్ వచ్చింది

**బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీజేపీ ఆఫీస్‌లో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి వచ్చారని, సన్నబియ్యం వివరాలు వెల్లడించకుండా దాటవేసారని, బీజేపీకి ఎక్కడ ఫేరొస్తుందో అనే ఇలా చేశారని మండిపడ్డారు. ఏదో లక్కీ డ్రా తీస్తే మీ గవర్నమెంట్ వచ్చిందని, మీ ప్రభుత్వం మీద నీకు నమ్మకం లేకనే వేరే దగ్గర నుంచి మీరు నిలపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడీల రాజ్యాన్ని బద్దలు కొట్టింది బండి సంజయ్ కుమార్ అని అన్నారు. మీరు సన్న బియ్యం వివరాలు ప్రెస్‌మీట్ ద్వారా రిలీస్ చేయవల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాంప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రావుల రాజిరెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనగంటి నరేష్, పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సదానందం, ఊరగొండ రాజు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు దూడం శివప్రసాద్, పట్టణ కార్యదర్శి సుంకోజు రమేష్ చారీ, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు అంకారాపు రాజు, బిజెపి సీనియర్ నాయకులు సందేవేని రాజు రాజేందర్ సిరిసిల్ల వంశీ కోడం శ్రీనివాస్, సిరిమల్లె మల్లేశం, సూరం వినయ్, తాటిపాముల సత్యం, మేర్గు శ్రీనివాస్, తవటం రాజలింగం, మంచికట్ల భాస్కర్, కర్నె గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గడపగడపకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్



**ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి**

ముధోల్ ఏప్రిల్ 2 (మన బలగం): గడపగడపకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని తీసుకువెళ్లి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి అన్నారు. ముధోల్ మండలం లోని చింతకుంట, చింతకుంట తండా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి బాపూజీ చిత్రపటానికి మరియు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందామని గ్రామ ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ దుడ్డు ప్రసాద్, ప్రకాష్ హౌసే కార్, మాజీ సర్పంచ్ ధూమ్ నాయక్, రాథోడ్ గణేష్, ఎం సురేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లైడిటెక్టర్ పరీక్షతో హత్య కేసు నిందితుల గుర్తింపు



జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పంటించి కాలబెట్టి తిరిగి మృతదేహాన్ని కుటింబికులే గుర్తించక మిస్టరీగా మారిన కేసులో అనుమానితులను హైదరాబాద్‌లో లైడిటెక్టర్ పరీక్షతో పట్టుకొన్న సంఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ కథనం ప్రకారం గత ఏడాది ఏప్రిల్ నెలలో బిర్పూర్ గ్రామ శివారులో రోళ్ల వాగు ప్రాజెక్టు వద్ద కాలిపోయిన శవం ఉందని గ్రామస్తుల సమాచారంతో ఆ గ్రామ కార్యదర్శి చిన్న నర్సయ్య అన్ ఐడెంటిటీ డెడ్ బాడీగా బీర్పూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు అప్పటికే ఆ గ్రామంలో కనిపించని వ్యక్తుల కుటింబీకులతో శవ నిర్ధారణ చేయించారు. మృతుడు అంకం లక్ష్మినారాయణ కుటుంబీకుల తోను మృతదేహాన్ని గుర్తించే ప్రయత్నం చేశారు. అతని కుటుంబికులు, చిన్న కుమారుడు సాయి కుమార్ అతని భార్య అరుణ ఈ డెడ్ బాడీతో మాకెలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో పోలీసులకు వీరిపై అనుమానం పెరిగిందన్నారు. ఆ తరువాత సాయి కుమార్, అరుణను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించినా ఫలితం లేకపోయిందని నేరాన్ని చేసినట్లు ఒప్పు కోలేదన్నారు. చివరకు హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో సాయి కుమార్, అరుణలపై లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించగా నిందితులు నేరం చేసినట్లు ఒప్పుకొన్నారని డీఎస్పీ తెలిపారు. మృతుడు లక్ష్మి నారాయణ రోజు తాగి వచ్చి గొడవ చేస్తున్నాడన్న ఉద్దేశంతోనే సాయి కుమార్, అరుణ కలిసి చంపి పెట్రోల్ పోసి అంటించి రోళ్ల వాగు వద్ద పడేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తును చేసిన రూరల్ సి ఐ కృష్ణా రెడ్డి డి ఎస్పీ రఘు చందర్ అభినందించారు.

# ఆయిల్ ఫామ్ పంట మీద అవగాహన సదస్సు

బుగ్గారం, ఏప్రిల్ 2 (మన బలగం): మండలంలోని చిన్నాపూర్ మరియు యశ్వంత్రవుపేట గ్రామంలో ఆయిల్ పాం సాగును ప్రోత్సహించడానికి జిల్లాలోని వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ మరియు లోహియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో ఆయిల్ పామ్ పంట మీద అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జగిత్యాల నియోజకవర్గ ఉద్యాన అధికారి కందుకూరి స్వాతి మాట్లాడుతూ బుగ్గారం మండలంలో ఇదివరకే 300 ఎకరాలలో ఆయిల్పామ్ సాగును చేపట్టడం పట్టడం జరిగిందన్నారు. కొత్తగా ఆయిల్ పామ్ పంట సాగు చేయడానికి ముందుకు వచ్చే రైతులకు చెట్లను 90 శాతం సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందని, ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ. 21,000 ఉందని తెలిపారు. సమావేశంలో ఉద్యాన అధికారి కె.స్వాతి,ఏ ఈ ఓ శ్రీనివాస్ మరియు నవీద్, సెక్రటరీలు సతీష్ మరియు రాజు, లోహియా కంపెనీ ఫీల్డ్ ఎక్సక్లూటివ్ డి.శ్రీయ, చిన్నాపూర్ మాజీ సర్పంచ్ ధామ లతాశ్రీ నర్సింగం, రైతులు కర్ర విక్రమ్ రెడ్డి, కొండపల్కల కమలాకర్ రావు, మీనయ్య, యశ్వంత్రావుపేట రైతులు మహేష్, గంగయ్య, రాజయ్య , తదితరులు పాల్గొన్నారు.

# ఉమారాణి సేవలు అభినందనీయం



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 2 (మన బలగం): విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది ఉపాధ్యాయులే అని వీర్నపల్లి మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఉమారాణి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటుందని, ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలు అన్నారు. ఉపాధ్యాయులు శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంగల శ్రీనివాస్, గజన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాకేష్ గౌడ్, తిరుపతి జాదవ్, కావేరి, ఉపాధ్యాయులు ప్రేమ్ సాగర్, బలరాం నాయక్, మంజుల, శ్రీనివాస్, కవిత, రవి విద్యార్థులు పాల్గొన్నారు.



# రైతు పంట బూడిద పాలు

**పంట కుప్పలను కాల్చేసిన ఆగంతకులు**

ముధోల్ ఏప్రిల్ 2 (మన బలగం): ఎవరో ఆగంతకులు ఎండబెట్టి కుప్పలుగా వేసిన పంటను కాల్చేశారు. ఆరుగాలం పండించిన పంట ఇంటికి వచ్చే చివరి క్షణాలలో బుడిదై కనిపించడంతో రైతు ఆశలన్నీ ఆవిరైపోయాయి. ఈ ఘటన ముధోల్ మండల కేంద్రంలో జరగడంతో రైతులందరు భయబ్రాంతులకు గురిఅయ్యారు. ముధోల్‌లోని బ్రాహ్మణ్ గల్లికి చెందిన కోరి యోగేష్ సుమారు పది ఎకరాలలో మొక్కజొన్న, జొన్న పంటలను వేరువేరు ప్రాంతాలలో పండించాడు. పంట పూర్తిగా ఎండిన తరువాత హార్వెస్టర్ పట్టిస్తానని పంట మొత్తాన్ని ఒకే చేనుకు తరలించి, వేరువేరు కుప్పలు వేసాడు. ఇటీవల వర్షం పడడంతో రక్షణ కొరకు టార్పాలిన్‌ను కప్పి ఉంచాడు. బుధవారం ఉదయం చేనుకు రాగానే ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు పంట కుప్పలను కాల్చారని గమనించి కన్నీరు పెట్టుకున్నాడు. చేతికందిన పంట అగ్గి పాలవడంతో రైతు చేసిన అప్పు ఎలా తీర్చాలో ఆవేదన వ్యక్తం చేశారు.